సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 28 । మార్చి । 2025



‘డీహైడ్రేటర్’కు పేటెంట్

ప్రభుత్వ స్కూల్ ఉపాధ్యాయుడు తయారు చేసిన సోలార్ డీహైడ్రేటర్ మోడల్‌కు ఇండియన్ పేటెంట్ లభించింది. - IIలో



నిజమైన పండుగ ఉగాది

సాహితీ లోకానికి నిజమైన పండుగ ఉగాది అని జాతీయ ఉత్తయ సినీ గేయ పురస్కార గ్రహీత అశోక్ తేజ అన్నారు. - IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సా॥)

సహర్ 4-51 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ అప్పారావు

పాలకవీడు: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ అప్పారావు ఆదేశించారు. పాలకవీడు మండల కేంద్రలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో తాగునీరు సమస్యలు, ఉపాధి పనులపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించకుండా కార్యాలయాల్లో కూర్చుని రికార్డుల్లో నమోదు చేయడడం లాంటివి చేయొద్దన్నారు. నర్సరీల్లో గ్రీన్ నెట్ ఏర్పాటు చేసుకోవాలని, క్రమం తప్పక మొక్కలకు నీరందించాని ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మి, ఏపీఓ రాజు, కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు: ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చిలుకూరు మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 1న నారాయణపురం గ్రామ శాఖ మహాసభతో ప్రారంభంకానున్న జిల్లా మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు సాహెబ్ అలీ, కె.వెంకటయ్య, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య, దొడ్డా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన



రఘునాథపాలెం వద్ద ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 247లో ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న వ్యవసాయ కళాశాల నిర్మాణానికి గురువారం జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు స్థానిక వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రఘునాథపాలెం వద్ద వ్యవసాయ కళాశాల నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందని, దీంట్లో భాగంగా స్థల పరిశీలన చేశామని నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నరేష్, తహసీల్దార్ మంగా, ఏడీఏ రవినాయక్, ఏఓ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారికి మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం చేసి తులసీదళాలతో అర్చించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు జరిపించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

తాళ్లగడ్డ (సూర్యాపేట): దేశంలోని క్రైస్తవులకు రక్షణ కల్పించాలని పాస్టర్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు మీసాల గోవర్దన్ కోరారు. తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మత ప్రచారకుడిగా పేరొందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణాన్ని ఏపీ ప్రభుత్వం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని నిరసిస్తూ గురువారం సూర్యాపేటలోని బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కోశాధికారి సామ్యూల్ కిరణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూర్ణ శశికాంత్, లాజర్ నాయక్, జెవైవి.రమేష్ బాబు, అనిల్ కుమార్, పీటర్ బాబు, రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.




సూర్యాపేటలో నిరసన తెలుపుతున్న పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిధులు

పల్లెలకు పాలనాధికారులు

జీపీఓ పేరుతో కొత్త పోస్టులు మంజూరు

- రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి కొత్త సిబ్బంది
- నియామకానికి జనవరి నుంచే దరఖాస్తుల ఆహ్వానం
- పూర్వ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలకు అవకాశం



నాగారం: గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రజలకు రెవెన్యూ సేవలు అందించేలా గ్రామ పాలనాధికారి(జీపీఓ) పేరుతో ఉద్యోగులను నియమించేందుకు సిద్ధమైంది. ఇది వరకు గ్రామాల్లో సేవలందించిన వీఆర్ఓ, వీఆర్‌ఏల వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసి వారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యవస్థ రద్దయ్యాక.. రెవెన్యూ పరంగా గ్రామాల్లో భూ సమస్యలు, సంక్షేమ పథకాల అర్హుల గుర్తింపు, ఇతర సర్వేలకు ఇబ్బందిగా మారింది. ఇది గమనించిన ప్రభుత్వం గ్రామాల్లో సేవల కోసం ఉద్యోగులు ఉండాలని భావించి కొత్త పోస్టులకు శ్రీకారం చుట్టింది.

గతంలో ఉన్న గ్రామ రెవెన్యూ సిబ్బంది ఇలా..	
వీఆర్‌ఓలు	207
వీఆర్‌ఏలు	416
జీపీఓ పోస్టులకు అందిన దరఖాస్తులు	297

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా..

అయితే గత ప్రభుత్వ హయాంలో ఇతర శాఖల్లో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలను సర్దుబాటు చేశారు. ఇందులో 2022 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం 207 మంది వీఆర్‌ఓలు రెవెన్యూతో పాటు 37 శాఖల్లో, 2023 ఆగస్టులో వీఆర్‌ఏలు 416 మందిని ఎనిమిది శాఖల్లో సర్దుబాటు చేశారు. దీంతో గ్రామాల్లో భూ సర్వేలు, భూమి హక్కులు, విద్యార్హత ధ్రువపత్రాల జారీ, విచారణలు, సంక్షేమ పథకాల అర్హుల గుర్తింపు, విపత్తుల సమాచారం అందజేయడం, తదితర వాటిపై ప్రభావం చూపింది. ఫలితంగా కొన్నింటిని పంచాయతీ కార్యదర్శులతో చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచేలా ఆర్థిక శాఖ జీపీఓ పోస్టులు మంజూరు చేసింది. జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా వీటితో 279 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిల్లో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు తిరిగి జీపీఓలుగా నియమించాలని నిర్ణయించింది. కాగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీఓని నియమిస్తారా? అనేది ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

జీపీఓ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గ్రామ పాలనాధికారి పోస్టుల నియామకాల కోసం పూర్వ వీఆర్‌ఏ వీఆర్‌ఓ తిరిగి మాతృసంస్థకు వచ్చేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి ఈ ఏడాది జనవరిలోనే దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఆహ్వానించింది. దీంతో 297 మంది జీపీఓ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో వీఆర్‌ఏలు 159, వీఆర్‌ఓలు 138 మంది ఉన్నారు. అయితే జిల్లాలో ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయో.. ఎంత మందిని నియమిస్తారనేది రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే..

గ్రామ పాలనాధికారి (జీపీఓ) నియామకాలపై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. జీపీఓల అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది. వీరి నియామకాల గురించి ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వేస్తే నియామకాల ప్రక్రియ ప్రారంభిస్తాం.

– రాంబాబు, జిల్లా అదనపు కలెక్టర్, సూర్యాపేట

ఎస్‌హెచ్‌జీలు.. విలీనం

- మెప్మా, సెర్ప్‌లను ఒకే గొడుగు కిందకు తేవాలని ప్రభుత్వం నిర్ణయం
- ఇక.. అన్ని గ్రూప్‌లు డీఆర్‌డీఏ పరిధిలోకి..
- జిల్లాలో మొత్తం స్వయం సహాయక సంఘాలు 23,345

హుజూర్‌నగర్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు) ఒకే గొడుగు కిందకు రానున్నాయి. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళా సంఘాలు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), మున్సిపల్ ప్రాంతాల్లోని సంఘాలు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతూ వస్తున్నాయి. అయితే ఈ రెండు విభాగాలకు చెందిన సంఘాలన్నింటినీఒకే గొడుగు కిందకు తీసుకుని రావాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మెప్మాను సెర్ప్‌లో విలీనం చేయడంతో పాటు ఉద్యోగులను డీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకురానున్నారు.

డీఆర్‌డీఓ పర్యవేక్షణలో..

ప్రస్తుతం మెప్మా ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలు ఇప్పించడంతో పాటు ఇందిరా మహిళాశక్తి అమలులో ఈ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. సెర్ప్‌లో విలీనమైతే వీరంతా ఇక నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుంది.

ఏ సర్వే చేపట్టినా మెప్మా ఆర్పీలకే బాధ్యతలు

మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వం ఏ సర్వే చేపట్టినా మెప్మా ఆర్పీలకే ఆ బాధ్యతలు అప్పగించేవారు. ఓటర్ల జాబితా సవరణ, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులపై విచారణ తదితర పనులకు మెప్మా ఆర్పీల సేవలను వినియోగించుకునే వారు. వీరిని సెర్ప్‌లో విలీనం చేస్తే మున్సిపాలిటీల్లో ప్రభుత్వం నిర్వహించే వివిధ రకాల సర్వేలకు ఇబ్బందులు కలిగే అవకాశం లేకపోలేదు. అయితే ఇప్పుడున్న టీఎంసీలు, సీఓలు, ఆర్పీలను డీఆర్‌డీఏ కిందకు తెస్తారా లేక మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలోనే ఉంచుతారా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

స్వయం సహాయక సంఘాల వివరాలు	
మండలాల్లో	17,940
మున్సిపాలిటీల్లో	5,405
మొత్తం సభ్యులు	2,38,331
23 మండలాల్లో వీఓలు	579

ఉత్తర్వులు రావాల్సి ఉంది

సెర్ప్, మెప్మా విలీనానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తాం.

– రేణుక, మెప్మా ఇన్‌చార్జి పీడీ, సూర్యాపేట

రెన్యువల్ చేసుకోవాలి

నల్లగొండ: జిల్లాలోని ప్రైవేట్ డీఈడీ కాలేజీ యాజమాన్యాలు 2025–26 విద్యా సంవత్సరం నుంచి 2028–29 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష డీడీ లేదా బ్యాంకు చెక్కు రూపంలో ద చైర్‌పర్సన్ ఆఫ్ ద అఫిలియేషన్ కమిటీ అండ్ ద డీఎస్ఈ తెలంగాణ హైదరాబాద్ పేరున చెల్లించాలని సూచించారు. చెల్లించిన ఫీజు వివరాలతో పాటు ప్రతిపాదనలు ఈ నెల 31లోగా ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

మట్టపల్లి హుండీ ఆదాయం రూ.6.34లక్షలు



హుండీల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్తలు, అధికారులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోని హుండీలను గురువారం సహాయ కమిషనర్ కె.భాస్కర్, ఆలయ ధర్మకర్తలు, ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. ఫిబ్రవరి 14నుంచి మార్చి 26వరకు 41 రోజులకు గాను రెగ్యులర్ హుండీల ద్వారా రూ.6,04,125, అన్నదానం హుండీ ద్వారా రూ.30,370తో కలిపి మొత్తం రూ.6,34,495 ఆదాయం సమకూరినట్లు ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ముందుగా ఆయలంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు, అర్చకులు, శ్రీసాయి సేవాసంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలగొద్దు

- సీఎం సభను విజయవంతం చేయాలి
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హుజూర్‌నగర్‌లో సభ ఏర్పాట్ల పరిశీలన

హుజూర్‌నగర్: సీఎం సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 30న హుజూర్‌నగర్‌లో జరగనున్న సీఎం సభాస్థలి ఏర్పాట్లను పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సభకు వచ్చే ప్రజలకు నీడ ఉండేలా హ్యాంగర్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. మజ్జిగ ప్యాకెట్లు, చల్లని తాగునీరు అందించాలన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూడాలన్నారు. పార్కింగ్ స్థలాలకు అప్రోచ్ రోడ్లు శుక్రవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి మంత్రి క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేసారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభానికి లబ్ధిదారులను ఎంపిక చేసి సిద్ధంగా ఉంచాలని మంత్రి చెప్పారు. రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం లెడ్ స్క్రీన్‌లను ప్రజలు తిలంకించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్‌డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, వేణుమాధవరావు, డీఎస్ఓ రాజేశ్వర్, డీఎం ప్రసాద్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ గర్వకారణం

రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీని హుజూర్‌నగర్‌లో ప్రారంభించడం మనందరికీ గర్వకారణం అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఉగాది రోజు పట్టణంలో సీఎం పర్యటనను పురస్కరించుకుని గురువారం హుజూర్‌నగర్‌లోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 43 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించామని, దానిని కేంద్రానికి పంపడంతో మీ ఉత్తమన్న కీలక పాత్ర పోషించారన్నారు. సీఎం సభకు ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష



ఓపెన్ ఫోరంలో పాల్గొన్న డిప్యూటీ సీఈఓ శిరీష, అధికారులు

పెన్‌పహాడ్: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీలో ఆమె మాట్లాడారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన వివిధ పనులపై గ్రామ స్థాయిలో నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలపై ఓపెన్ ఫోరంలో చర్చించారు. ఇప్పటి వరకు వివిధ పనులకు సంబంధించి రూ.8,9,6,364 ఖర్చు చేసినట్లు తెలిపారు. పలు గ్రామాల్లో కొలతల్లో తేడాలు, మస్టర్లలో పేర్లు కొట్టివేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ.1.39లక్షలు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన పలువురు సిబ్బందికి రూ.39వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఆశాకుమారి, అంబుడ్స్‌మెన్ లచ్చిరాంనాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ రవి, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఈసీ మహేష్, ఎస్ఆర్‌పీ సాయిలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సునీత

భానుపురి: తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సునీత అన్నారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నేషనల్ బి బోర్డు ఆధ్వర్యంలో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపైవ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యాన పంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమ కంది, పొలాల్లో తేనెటీగల పెట్టెలను అమర్చి లాభాలను పొందవచ్చని తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా వీటిని పెంచొచ్చని, తద్వారా వినియోగదారులకు స్థానికంగా తక్కువ ధరకు స్వచ్ఛమైన నాణ్యమైన తేనె దొరుకుతుందన్నారు. ఈ సదస్సులో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రజనీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ అధికారి నాగయ్య, ఉద్యాన శాఖ అధికారులు, ఏడీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సునీత

ఆడిటింగ్ పేరుతో అడ్డగోలుగా వసూళ్లు!

- మెప్మాలో అవినీతి బాగోతం
- ఒక్కో ఆర్‌పీల నుంచి రూ.1,600 వరకు
- 255 మంది నుంచి రూ.4 లక్షలు వసూలు
- కలెక్టర్‌కు ఆర్‌పీలు ఫిర్యాదు చేసినట్లు సమాచారం

కోదాడ: మున్సిపాలిటీల్లోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో గడిచిన రెండు నెలలుగా ఆడిటింగ్ పేరుతో అధికారులు అడ్డగోలుగా రిసోర్స్ పర్సన్ల(ఆర్‌పీల) నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదు మున్సిపాలిటీల్లో సుమారుగా 3,825 సమభావన సంఘాలున్నాయి. ప్రతి 15 సంఘాలకు ఒక ఆర్‌పీ చొప్పున 255 మంది ఉన్నారు. మహిళా సంఘాలకు లోన్లు ఇప్పించడం, ప్రభుత్వ పథకాలను సభ్యులకు అందేటట్లు చూడడం ఆర్‌పీల బాధ్యత. దీనికోసం ప్రతినెలా వీరికి రూ.6వేల వరకు గౌరవ వేతనం ఇస్తుంటారు. ప్రతిఏటా ఆర్‌పీలు తమ పరిధిలో కార్యకలాపాలకు సంబంధించి ఆడిటింగ్ చేయించుకోవాలి. కానీ ఇక్కడే వసూళ్ల తంతు మొదలవుతోంది.



ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లింపులు..

జిల్లాలో ఈ ఏడాది జనవరి 20 తరువాత ఆడిటింగ్ మొదలైంది. దీన్ని ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. వారు ఆయా మున్సిపాలిటీలకు వెళ్లి అక్కడ ఉన్న ఆర్‌పీల రికార్డులను ఆడిటింగ్ చేయాలి. ఇంత వరకు బాగానేఉన్నా ఇక్కడే అసలు కథ మొదలైంది. ఆడిటింగ్ కోసం ప్రతి ఆర్‌పీ రూ.1,600 ఆడిటింగ్‌కు వచ్చిన వారికి ఇవ్వాలని షరుతు పెట్టారు. దీంతో పలువురు ఆర్‌పీలు ఈ డబ్బును ఫోన్‌పే, గుగూల్ పే ద్వారా చెల్లించారు. ఈ విషయం బయటకు పొక్కడంతో జిల్లా స్థాయి అధికారి ఒకరు తమను బెదిరిస్తున్నట్లు ఆర్‌పీలు వాపోతున్నారు. తమకు ఇచ్చేది అరకొర వేతనాలు, అవికూడా సక్రమంగా ఇవ్వడం లేదని అలాంటిది తమ నుంచి ఇలా వసూలు చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈసారి తమ నుంచి వసూలు చేసిన దాదాపు రూ.4లక్షలకుపైగా డబ్బుల విషయంపై ఉన్నాధికారులు విచారణ జరపాలని పలువురు ఆర్‌పీలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

మెప్మా ఇన్‌చార్జి పీడీ ఏమంటున్నారంటే..

ఈ విషయమై జిల్లా మెప్మా ఇన్‌చార్జి పీడీని వివరణ కోరగా తనను కొందరు టార్గెట్ చేస్తున్నారని పేర్కొన్నారు. రోజుకొకరు ఫోన్ చేస్తున్నారని, ఇది కరెక్ట్ కాదని, తాను వైద్యశాలలో ఉన్నానని తరువాత ఫోన్ చేస్తానని ఫోన్ కట్ చేశారు.

క్లుప్తంగా

మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి ఆత్మహత్య


లచ్చిరెడ్డి (ఫైల్)

మాడ్గులపల్లి: మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మాడ్గులపల్లి మండలంలోని గంధ్రవానిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంధ్రవానిగూడెం గ్రామానికి చెందిన కంచర్ల లచ్చిరెడ్డి(58) మతిస్థిమితం కోల్పోయాడు. ఇటీవల ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు వెతికి తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. లచ్చిరెడ్డి బుధవారం గ్రామ శివారులోని తన సొంత భూమిలో మేకలను కాసేందుకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుమారులు వెతకగా గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు సురేష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి


హరీష్ (ఫైల్)


యాదగిరిగుట్ట రూరల్: రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరాయపల్లి గ్రామానికి చెందిన కైరంకొండ హరీష్ (26) వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై యాదగిరిగుట్టకు వెళ్లాడు. పనులు ముగించుకుని తన గ్రామమైన గౌరాయపల్లికి సాయంత్రం సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మాసాయిపేట గ్రామానికి రాగానే, ముందు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి ఢీ కొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న హరీష్ రోడ్డుపై ఎగిరిపడ్డాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో, 108 సాయంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా.. నడుచుకుంటూ వెళ్తున్న మాసాయిపేట గ్రామానికి చెందిన వాకిటి కరుణాకర్ అనే యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

మునుగోడు: మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు చిలువేరు శంకర్ తన ఆవును వ్యవసాయ బావి వద్ద మేపుతున్నాడు. ఈక్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు ఆవు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

సోలార్ డీహైడ్రేటర్ మోడల్‌కు పేటెంట్

- హక్కులు సాధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీరామ్ శ్రీనివాస్


శ్రీనివాస్ తయారు చేసిన సోలార్ డీహైడ్రేటర్

కోదాడ: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు సైన్స్‌పై ఉన్న మక్కువతో తన స్నేహితుడితో కలిసి తయారు చేసిన సైన్స్ మోడల్‌కు పేటెంట్ లభించింది. వీరు తయారు చేసిన సౌరశక్తితో పని చేసే సోలార్ డీహైడ్రేటర్ మోడల్‌కు ఇండియన్ పేటెంట్ కార్యాలయం న్యూఢిల్లీ వారు ఈనెల 21న తమ గెజిట్‌లో ప్రచురించారు. ఈ పరికరాన్ని ఉపయోగించి సూర్యరశ్మి ద్వారా ఆహార పదార్థాలు ఎలాంటి రంగు మారకుండా, పోషకవిలువలు తగ్గకుండా ఎండబెట్టుకోవచ్చు.

రూపకల్పన ఇలా..

సూర్యాపేట జిల్లా మునగాల ప్రభుత్వ పాఠశాలలో భౌతికశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్రీరామ్ శ్రీనివాస్.. శ్రీనిధి యూనివర్సిటీలో భౌతికశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పోతుకనూరి నాగరాజుతో కలిసి ఈ పరికరాన్ని తయారు చేశారు. తక్కువ ఖర్చుతో, సౌరశక్తితో ఈ పరికరం పనిచేస్తుంది. లోకాస్ట్ డీహైడ్రేటర్ విత్ ఇన్‌డైరెక్ట్ సోలార్ ఎనర్జీ గా ఈ పరికరానికి పేరు పెట్టారు. సూర్యరశ్మి ఏ దిశలో ఉన్నా ఈ పరికరం సౌరశక్తిని గ్రహించి పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి ఆహార పదార్థాలను ఎండబెట్టుకోవచ్చు. దీని వల్ల ఆహార పదార్థాల నాణ్యత, పోషకవిలువలు, రంగు తగ్గవని వీరు చెపుతున్నారు. ఈ మోడల్‌ను ఇటీవల రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించారు.

పేటెంట్ పొందడం ఆనందంగా ఉంది



తక్కువ ఖర్చుతో సౌరశక్తిని ఉపయోగించుకొని పనిచేసే విధంగా ఈ పరికరాన్ని తయారు చేశాం. పేటెంట్ కోసం సంవత్సరంన్నర క్రితం దరఖాస్తు చేశాం. ఇండియన్ పేటెంట్ కార్యాలయం వారు వివిధ దశలలో దీన్ని పరిశీలించి మాకు ఈ నెల 23న పేటెంట్ ఇస్తూ అధికారిక జర్నల్‌లో ప్రచురించడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ శ్రీరామ్ శ్రీనివాస్

సాహితీ లోకానికి నిజమైన పండుగ ఉగాది


శెట్టిబాలయ్య యాదవ్‌ను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న సుద్దాల అశోక్ తేజ

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

భువనగిరి: సాహితీ లోకానికి నిజమైన పండుగ ఉగాది అని జాతీయ ఉత్తమ సినీ గేయ పురస్కార గ్రహీత సుద్దాల అశోక్ తేజ అన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది ఉత్సవాలు– 2025లో భాగంగా గురువారం రాత్రి భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో గల సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో కవి సమ్మేళనం– ఉగాది పురస్కారాల ప్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవులు, రచయితలకు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచే శక్తి ఉంటుందన్నారు. అతి ప్రాచీన కాలం నుంచి కవులు ఉగాది సందర్భంగా కొత్త రచనలు చేస్తుండడం జరుగుతుందన్నారు. గతంలో భువనగిరి నుంచి ఎంతో మంది కవులు జాతీయ స్థాయికి ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుతం ఉన్న కవులు, రచయితలు ఎదగాలన్నారు. అనంతరం శెట్టి బాలయ్య యాదవ్, విరువంటి గోపాల కృష్ణ, లెక్కల మల్లారెడ్డి, హజారి జనార్దన్‌రావు, తోట వెంకటేశ్వరరావులకు జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. అనంతరం బండారు జయశ్రీ, దండమూడి శ్రీచరణ్, డాక్టర్ పాండాల మహేశ్వర్, వంగలరి ప్రణయరాజ్, బైరపాక స్వామిలకు సాహిత్య పురస్కారాలను డాక్టర్ గుర్రం లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, రాగిరామశ్రీ సహదేవ్, కస్తూరి లక్ష్మీనారాయణ,కటకం శ్రీనివాస్‌లకు సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీ యూనివర్శిటి మాజీ రిజిస్ట్రార్ కట్టా ముత్యంరెడ్డి, తెలంగాణరాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, బండిరాజులుశంకర్, పెండెం సత్యనారాయణ, మామిడాల చంద్రశేఖర్, గడ్డం నరసింహరెడ్డి, సోమ సీతారాములు,రామాంజనేయులు,ఎస్ఎస్‌చారి,జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోరెడ్డి రంగయ్య, బండారు జయశ్రీ, మెరుగు సదానందం, లింగారెడ్డి, బండారు శ్రీనివాస్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తికి 27ఏళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): యువతిని ప్రేమించి, మోసం చేసిన వ్యక్తికి 27ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గుర్రంపోడ్ మండలం శాఖాజిపురం గ్రామానికి చెందిన యువతి తన కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండలో ఉంటుంది. యువతి సోదరుడి ద్వారా కనగల్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన నల్లబోతు జగన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించాడు. లైంగికంగా లోబర్చుకున్నాడు. యువతి గర్భం దాల్చిన విషయాన్ని జగన్‌కు చెప్పింది. అతను కాలయాపన చేస్తుండడంతో గట్టిగా నిలదీసింది. ఇదివరకే తనకు వివాహమైందని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని వివాహం చేసుకోలేనని యువతికి చెప్పాడు. ఈక్రమంలో ఆమెకు బాబు పుట్టాడు. డీఎన్‌డీఏ టెస్ట్ చేయడంతో శిశువుకు బయాలాజికల్ ఫాదర్ జగన్ అని తేలింది. నమ్మించి తనను మోసం చేశాడని యువతి 2019 మే 29న గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు జగన్‌ను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలో ఏకీభవించిన జడ్జి రోజారమణి సెక్షన్ 376(2)(ఎన్) ఐపీసీ కింద 10 సంవత్సరాలు జైలు, రూ.వెయ్యి జరిమానా, సెక్షన్ 3(2)(వి) ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద 10 సంవత్సరాల జైలు, రూ.వెయ్యి జరిమానా, సెక్షన్ 420 ఐపీసీ ప్రకారం 7 సంవత్సరాల జైలు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ శిక్షలు ఏకకాలంలో అమలు కానున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. కేసులో సరైన ఆధారాలను సేకరించి కోర్టు ఛార్జ్ షీటు దాఖలు చేసిన ఏఎస్పీ మౌనిక, ఎస్సై మధు, సిబ్బంది ఎండీ ఇంతియాజ్ అహ్మద్, మహేశ్వర్, ఆనంద్, ఎండీ ఖలీల్ అహ్మద్, లైజన్ అధికారులు నరేందర్, మల్లిఖార్జున్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

జూదం స్థావరంపై పోలీసుల దాడులు

- ఎనిమిది మంది అరెస్ట్
- రూ.25 వేల నగదు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని జూదం స్థావరంపై పట్టణ పోలీసులు, సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం సాయంత్రం బాబురావు అనే వ్యక్తి ఇంట్లో గ్రూప్‌గా ఏర్పడి జూదం ఆడుతున్న 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.25 వేల నగదు, 8 సెల్ ఫోన్లను సీజ్ చేసి సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బాబురావు, వైరాకు చెందిన రామారావు, కూసుమంచికి చెందిన కిరణ్, కూసుమంచి చెందిన నాగేశ్వరరావు, మునగాల మండలానికి చెందిన వెంకట్ రెడ్డి, ఖమ్మానికి చెందిన గోపి, సూర్యాపేట పట్టణానికి చెందిన ఖాజా, ఆత్మకూరు మండలానికి చెందిన ఏడుకొండలు ఉన్నారు.

కులం పేరుతో దూషించిన ముగ్గురికి ఏడాది జైలు

రామగిరి(నల్లగొండ), మాడ్గులపల్లి: కులం పేరుతో దూషించిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020లో మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన నకిరేకంటి శ్రీనివాస్ వరిపొలం కోసేందుకు భార్య రజితతో కలసి వెళ్లాడు. వరి కోస్తున్న క్రమంలో వరికోత మిషన్ పక్కన భూమిని ఆనుకుని ఉన్న బట్టు సైదిరెడ్డి భూమిలోకి వెళ్లింది. దీంతో బట్టు సైదిరెడ్డితోపాటు, కుటుంబ సభ్యులు మిషన్‌ను అడ్డుకొని కులం పేరుతో దూషిస్తూ శ్రీనివాస్‌పై దాడి చేశారు. అతడి ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు వారిపై భార్య రజిత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేయగా డీఎస్పీ వై. వెంకటేశ్వరరావు విచారణ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి బట్టు సైదిరెడ్డి, బట్టు మహేందర్‌రెడ్డి, బట్టు లక్ష్మమ్మలకు సెక్షన్ 325 ఐపీసీ కింద ఆరు నెలలు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమాన, సెక్షన్ 3(1)(ఆర్)(ఎస్) ఎస్సీ ఎస్టీ ప్రకారం 6 నెలలు జైలు శిక్ష రూ. వెయ్యి జరిమాన విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు కానున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. కేసు విచారణలో కోర్టుకు సరైన ఆధారాలు సేకరించి సమర్పించిన కోర్టు కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌ను అభినందించారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

నల్లగొండ: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత బుధవారం రాత్రి నల్లగొండ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు వెంటనే 100కు సమాచారం ఇచ్చారు. స్పందించిన టూటౌన్ ఎస్ఐ సైదులు.. కానిస్టేబుళ్లు నాగరాజు, సతీష్‌లను రైల్వే స్టేషన్‌కు పంపించారు. వారు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, సఖీ సెంటర్‌కు తరలించారు. గురువారం కుటుంబ సభ్యులను పిలిపించారు. ఈమేరకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను వారికి అప్పగించారు.

మద్యానికి డబ్బులు కావాలని తల్లితో గొడవ

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లి
- మద్యంమత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న కుమారుడు
- చికిత్స పొందుతూ మృతి

మిర్యాలగూడ అర్బన్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తల్లితో గొడవ పడ్డాడు. ఆమె పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో కుమారుడు మద్యం మత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగడ్డకు చెందిన గుంటోజు వసంతరాయుడు, జయమ్మల కుమారుడు గుంటోజు మధుబాబు(42) భార్య గొడవల కారణంగా అతడిని వదిలి వెళ్లిపోయింది. దీంతో మధుబాబు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లిని వేధించసాగాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న మధుబాబు తనకు డబ్బులు ఇవ్వాలని, లేకుంటే ఆస్తిలో వాటా ఇవ్వాలని తల్లితో గొడవపడ్డాడు. దీంతో విసిగిపోయిన తల్లి జయమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం మత్తులో ఉన్న మధుబాబు తనపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ.. అప్పటికే తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. అప్పటికే తీవ్ర గాయాలపాలైన అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో నల్లగొండ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చౌటుప్పల్‌లో బేకరీ సీజ్

- గడువు ముగిసిన తినుబండారాలు, బ్రెడ్ ప్యాకెట్ల గుర్తింపు


వంట గదిలో సామగ్రి నాణ్యతను పరిశీలిస్తున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీని మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. గురువారం బేకరీలో తనిఖీలు నిర్వహించిన అధికారులు వంటగదిలో ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని, గడువు ముగిసిన తినుబండారాలు విక్రయిస్తున్నట్లు, అదేవిధంగా బేకరీలో నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో బేకరీని సీజ్ చేసి, రూ.5వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. హోటళ్లు, బేకరీల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆహార పదార్థాలు, తినుబండారాల తయారీలో నాణ్యతతోపాటు పరిశుభ్రత పాటించకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, రఘుపతి, లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు దుర్మరణం

చండూరు: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ పరిధిలోని పాపిరెడ్డిగూడెం కల్వర్టు వద్ద జరిగింది. నాంపల్లి మండలం జాన్‌తండా పరిధిలోని దొరనిగడ్డతండాకు చెందిన మెగావత్ భాస్కర్ బంగారిగడ్డ నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో పాపిరెడ్డిగూడెం కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామికి తిరువీధి ఉత్సవ సేవ


స్వామి వారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం రాత్రి స్వామి వారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సుదర్శన నరసింహ హవనం, తిరుప్పావడ సేవ,, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు, అర్చకులు పాల్గొన్నారు.

5 లీటర్ల సారా పట్టివేత

కొండమల్లేపల్లి: మండలంలోని చింతచెట్టుతండా నుంచి కొండమల్లేపల్లికి గురువారం ఓ వ్యక్తి బైక్‌పై తరలిస్తున్న 5 లీటర్ల నాటు సారాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు తనిఖీ చేసి సారాను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఎంజీయూ ఆవరణలో చెలరేగిన మంటలు


ఇంజనీరింగ్ కళాశాల వెనుక భాగంలో దగ్ధమవుతున్న చెట్లు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ లోపల ఇంజనీరింగ్ కాలేజీ వెనుక భాగంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేసవి కావడంతో ఎండిపోయి న గడ్డి, పిచ్చి మొక్కలు, చెట్ల నుంచి రాలిన ఎండి ఆకులు ఉండడంతో మంటలు అంటుకున్నట్లు తెలిసింది. అగ్గిపుల్ల వెలిగించి, ఆర్పేయకుండా పడవేయడంతో ఎండిన గడ్డికి అంటుకొని మంటలు వచ్చినట్లు భావిస్తున్నారు. సమయానికి నల్లగొండ పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో వాహనం అందుబాటులో లేకపోవడంతో రామన్నపేట నుంచి ఫైర్ ఇంజన్ తెప్పించి మంటలు చల్లార్చే ప్రయత్నం చేశారు. పెద్ద ఎత్తున మంటలు అంటుకుని పొగ కమ్ముకోవడంతో యూనివర్సిటీ హాస్టల్లో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. దాదాపు పది ఎకరాల్లో పెద్ద చెట్లు, మొక్కలు కాలి బూడిదయ్యాయి.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్.. ఒకరు మృతి

హుజూర్‌నగర్: ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన గురువారం చింతలపాలెం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలోని నెహ్రూనగర్‌కు చెందిన తాటికొండ నగేష్ (45) ఓ దినపత్రికలో రూట్ ఆపరేటర్‌గా చేస్తున్నాడు. దొండపాడు నుంచి ఆటో నడుపుకుంటూ చింతలపాలెం వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గాంధీనగర్ తండా వద్దకు రాగానే ఎదురుగా ట్రాక్టర్‌లో మిర్చిలోడు వేసుకొని వస్తున్న అజ్మీరగాంధీ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్ తాటికొండ నగేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నగేష్ అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి మేనల్లుడు బిక్కుమల్ల ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం


దగ్ధమైన ద్విచక్రవాహనం

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉంచిన రెండు ద్విచక్రవాహనాలు గురువారం తెల్లవారుజామున దగ్ధమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలనుపాక గ్రామంలో పెట్రోల్ బంక్(గాయత్రి ఫిలింగ స్టేషన్)లో బక్క నరేష్, నల్ల పరుశరాములు పని చేస్తున్నారు. రోజులాగే బంకులో వారి బైక్‌లను పక్కన నిలిపారు. రాత్రి బంక్‌లో నిద్రపోయారు. తెల్లవారుజామున చూసే సరికి రెండు బైక్‌లు పూర్తిగా దగ్ధమై ఉన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా చేశారు. బంక్ యజమాని ఆరె పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకర్ తెలిపారు.

వేసవిలో పశుసంరక్షణ తప్పనిసరి



గుర్రంపోడు: వేసవిలో పశువులు కూడా వడదెబ్బకు గురవుతాయి. నిర్లక్ష్యం చేస్తే అవి మృతిచెందే ప్రమాదం ఉంది. పశువులకు వడదెబ్బ నివారణపై పశువైద్యాధికారి సాయిరాం సలహాలు ఆయన మాటల్లోనే.. ఉష్ణోగ్రత పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పశువులు షెడ్లలో ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం, వడగాలుల తాకిడికి వడదెబ్బకు గురవుతాయి. తెల్లజాతి కంటే నల్ల జాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి.

వడదెబ్బ ప్రాణాంతకమే...

వేసవి కాలంలో బయటి ఉష్ణోగ్రత పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంధులపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో చర్మంపై గల స్వేద రంధ్రాలు చెమటను అధికంగా విడుదల చేసి శరీరంలోని ఎలక్ట్రోలైట్‌లను కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. మూత్ర పిండాలు సరిగా పనిచేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. తద్వారా శ్వాస ఆడక మృతిచెందుతాయి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మ సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడ కోసం చెట్ల కిందకు చేరుతాయి. అధిక దాహం ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 104 ఫారన్‌హీట్ దాటితే శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. శరీర ఉష్ణోగ్రత 109 డిగ్రీలు దాటితే ప్రాణపాయం సంభవిస్తుంది. వడదెబ్బ ప్రభా వం వల్ల చూలు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువుల్లో పునురుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి బాగా తగ్గిపోతుంది.


పాడి గేదెను చల్లని నీటితో కడుతున్న మహిళా రైతు

చికిత్స ఇలా..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రాంతానికి మార్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి తీసుకురావడానకి పలుమార్లు కడగాలి. తాగునీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజెక్షన్లు వేయించాలి. రక్తంలోని సైలెన్ ద్వారా గ్లూకోజు, ఎలక్ట్రోలైట్స్ అందిస్తే పశువులు నీరసం నుంచి బయటపడతాయి.

వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు

వేసవిలో పశువులను మధ్యాహ్నం వేళలో మేతకు వదలొద్దు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు పంపాలి. అన్నివేళలా తాగునీరు అందుబాటులో ఉంచాలి. పశువులను రోజుకు కనీసం రెండుసార్లు చల్లని నీళ్లతో కడగాలి. చెరువులు, కుంటల్లో ఈదనివ్వాలి. గాలి వెలుతురు వచ్చేలా ఎత్తయిన కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకులు ఉంటే మధ్యాహ్నం వేళల్లో వరిగడ్డి పరిచి మధ్యాహ్నం వేళల్లో నీరు చల్లాలి. షెడ్డుల నిర్మాణం తూర్పు, పడమర దిశలలోనే జరగాలి. దీనివల్ల వడగాలుల నుంచి తూర్పు, పడమర ఎండల నుంచి రక్షణ లభిస్తుంది. అదేవిధంగా పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం పాలు పితికేటప్పుడు పాదుగును చల్లని నీటిలో కడగాలి. పశువులకు గోమర్లు లేకుండా చూసుకోవాలి.

క్లుప్తంగా

జనార్దన్‌స్వామికి నివాళి



జనార్దన్ స్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి అలియాస్ జనార్దన్‌స్వామి అకాల మరణం చెందడంతో గురువారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్ సమీపంలో ఉన్న మునగనూరు శ్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈ సందర్భంగా అతడి మృతదేహానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నివాళులర్పించారు. జనార్దన్‌రెడ్డికి కూతురు కళాంబిక తలకొరివి పెట్టారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు ఇందుర్తి వెంకట్‌రెడ్డి, బీరవోలు వాసుదేవరెడ్డి, గణపురం నరేష్, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, గోలి కోటిరెడ్డి, ముదిరెడ్డి రమణారెడ్డి, గోగిరెడ్డి వెంకట్‌రెడ్డి, మారం వెంకట్‌రెడ్డి, మామిడి జానయ్య, కొణతం స్టాలిన్, జైపాల్‌రెడ్డి, కోటిరెడ్డి, గుండా శేఖర్, రాజేష్ ఉన్నారు.

చెస్ పోటీల్లో ప్రతిభ

సూర్యాపేటటౌన్ : కమిషన్ ఫర్ ఉమెన్ చెస్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ ఫిడే సంయుక్తంగా నిర్వహించిన క్వీన్స్ ఆన్‌లైన్ ఫెస్టివల్ 2025లో రాడికల్ చెస్ అకాడమీకి చెందిన సహస్ర అండర్ 17విభాగంలో, రమ్య అండర్ 15 విభాగంలో గెలిచి ఫైనల్‌కు ఎంపికయ్యారు. లీగ్ దశలో 193 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఆసియా, యూరప్, అమెరికా, ఆఫ్రికా ఖండాల నుంచి 290మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నట్లు కోచ్ ఎడవెల్లి అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

2న 'హలో బీసీ, చలో ఢిల్లీ'

సూర్యాపేటటౌన్ : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఏప్రిల్ 2న చేపడుతున్న హలో బీసీ, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి బీసీలు అందరూ తరలిరానున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలని ఏడాది కాలంగా చేసిన పోరాటానికి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి చట్టం తీసుకురావడం హర్షణీయమని పేర్కొన్నారు.

రహదారులపై ప్రమాదం జరిగే స్థలాల గుర్తింపు



బ్లాక్ స్పాట్స్ గుర్తిస్తున్న పోలీసులు

తిరుమలగిరి : సూర్యాపేట – జనగామ జాతీయ రహదారి, వలిగొండ – తొర్రూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో అనవసరమైన రోడ్ ఓపెనింగ్‌ల గురించి చర్చించారు. ప్రమాదకర ప్రాంతాల్లో బ్లింకర్లు, రంబుల్ స్ట్రిప్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సన్నబియ్యం అందించాలి

నాగారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకంలో భాగంగా రేషన్ డీలర్లు ఏప్రిల్ 1వ తేదీ నుంచి రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డీలర్లు రేషన్ షాపుల్లో ఉన్న పాత బియ్యం స్టాక్‌ను ఆన్‌లైన్‌లో చూపిన ప్రకారం ఒక గదిలో భద్రపర్చాలని, కార్డుదారులకు సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేయాలన్నారు. పాత బియ్యం పంపిణీ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హరితహారం చెట్లు దగ్ధం

చివ్వెంల : గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో సంపద వనంలోని చెట్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గురువారం చివ్వెంల మండల కేంద్రం శివారులోని ఎస్సారెస్పీ కాలువ పక్కన ఉన్న సంపద వనంలో చోటుచేసుకుంది. గత ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంపద వనాలను ఏర్పాటు చేసింది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సిగరేట్లు కాల్చి నిప్పును వనంలోకి వేయడంతో రాలిన ఆకులకు అంటుకుని చెట్లు దగ్ధం అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపద వనాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వనంలో దగ్ధమైన హరితహారం చెట్లు

గ్రామాల్లో ఇళ్ల మధ్యనే మురుగు!

- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వాల్యతండాలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

చివ్వెంల : గ్రామాల్లో మురుగు సమస్య ప్రజలను పట్టిపీడిస్తోంది. ఏళ్లుగా ఇళ్లమధ్యనే మురుగు నిలిచి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి సంవత్సరం డ్రెయినేజీ నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు ఖర్చు పెడుతున్నా, నిర్వహణ సరిగా లేకపోవడంతో మురుగు నీరు గ్రామాల వీధుల్లోనే దర్శనమిస్తోంది. పలు సందర్భాల్లో గ్రామాల్లో పర్యటించిన అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రజలు డ్రెయినేజీల గురించి నిలదీస్తున్నారు. దీంతో అధికారులు స్పందించి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చి వెళ్లిపోతున్నారు. కానీ తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఏళ్ల తరబడి ప్రజలు దుర్వాసనతోపాటు, దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటూ రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని వట్టిఖమ్మంపహాడ్, బద్యాతండా, పాశ్యానాయక్‌తండా, గుంజలూరు, జి.తిర్మలగిరి, వల్లభాపురం, తిమ్మాపురం, బి.చందుపట్ల, వాల్యతండా, మొగ్గయ్యగూడెం, పులితండా, సేవాలాల్ తండా, జగనాతండా, పిల్లల జెగ్గుతండాతోపాటు పలు గ్రామాల్లో డ్రెయినేజీలు సరిగాలేక మురుగు నీరంతా వీధులు, రోడ్లపైనే పారుతుండటంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికైనా అధికారుల స్పందించి గ్రామాల్లో మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు

గ్రామంలోని పలు వీధుల్లో మురుగు కాలువలు సరిగాలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లమధ్యన రోడ్లపైనే మురుగునీరు పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– బాష్పంగు సునీల్, బి.చందుపట్ల

అధికారులు స్పందించాలి

గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పక్కన యాదవ కాలనీలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– వీరబోయిన సైదులు, వట్టిఖమ్మంపహాడ్

యూనివర్సిటీ టాపర్‌కు నగదు బహుమతి



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న యాజమాన్యం

సూర్యాపేటటౌన్ : ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులను మరింతగా ప్రోత్సహిస్తామని మహర్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పల్లె నగేష్, కరస్పాండెంట్ నారాయణ ప్రవీణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఇటీవల వెలువడిన మహాత్మాగాంధీ యూనివర్సిటీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని మహర్షి డిగ్రీ కళాశాల విద్యార్థిని యాకమ్మ 10కి 10జీపీఏ సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థిని యాకమ్మకు రూ.10 వేల చెక్కును అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఏ సెమిస్టర్‌లోనైనా 10కి 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్, రూ.10వేలు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



తుంగతుర్తిలోని గురుకులంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకయ్య

తుంగతుర్తి : సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ వెంకయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ కళాబృందంతో కలిసి అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని అన్నారు. గంజాయి, మత్తు మందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్‌లకు తెలియజేయాలని సూచించారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని తెలిపారు. మెసేజ్‌లలో వచ్చే బ్లూ లింక్‌ను అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉమారెడ్డి, పోలీసు సిబ్బంది రవి, రమేష్, సాయి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై కళాజాత



దాచారంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని దాచారం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గురువారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పల్లెల లక్ష్మణ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు యువ వికాసం పథకంతో రుణాలు అందించనుందని తెలిపారు. త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతుందని, ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ జరగనుందని తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌యాప్‌లకు దూరంగా ఉండాలని, వాటి బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాకారులు గంట భిక్షపతి, వేముల శ్రవణ్, పల్లెల రాము, కొండమల్ల నాగలక్ష్మి, ఒంటెపాక ప్రియాంక, మేడి ఇంద్రజ, మేడి ప్రియదర్శిని పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు, నాయకులు



తుంగతుర్తి: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

తిరుమలగిరి : మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య అన్నారు. గురువారం పాత గ్రామంలోని మసీదులో రంజాన్ ఉపవాసం ఉంటున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ రెహమాన్ అలీ, కడెం లింగన్న, కందుకూరి ప్రవీణ్, వంగరి బ్రహ్మం, కందుకూరి శ్రీను, చేను శ్రీనివాస్, కందుకూరి సోమేశ్, కొత్తగట్టు యాదగిరి, ఖాసిం పాల్గొన్నారు.

తుంగతుర్తి : హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్ విందు అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని మజీద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మత గురువు మౌలానా అబ్దుల్ అహద్, జాన్, మాజీఆద్, వహీద్, అమీర్, అబ్దుల్, అమీర్, బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, గోపగాని రమేష్, యాకు నాయక్, ఉప్పుల నాగమల్లు, గోపగాని వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉగాది సంబరాలు



తిరుమలగిరి ప్రభుత్వ పాఠశాలలో ఉగాది సంబరాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి : తిరుమలగిరి జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం ముందస్తుగా ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ మాట్లాడారు. పండుగల ద్వారానే మన సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కవి ఆలేటి శంకర్, దుర్గాప్రసాద్, జానయ్య, శ్రీనివాసాచారి, అశోక్, ఉపేంద్ర, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల పరిశీలన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామంలో గురువారం సెగ్రిగేషన్ షెడ్, శ్మశానవాటికలను ఎంపీడీఓ టి.గోపి పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్లను నిత్యం వినియోగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే శ్మశాన వాటికలలో ఉన్న సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెడ్డిమల్ల కృష్ణవేణి, గ్రామ పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జ్ఞానసుందర్



తుంగతుర్తి : తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అన్నెపర్తి జ్ఞానసుందర్ ఎన్నికైనారు. ఉపాధ్యక్షుడిగా కారింగుల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా ఎండీ పర్వీన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా రాజారాం, ఈసీ సభ్యులుగా బానోతు ప్రతాప్, కోశాధికారిగా బానోతు సతీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జ్ఞానసుందర్ మాట్లాడుతూ జూనియర్ సివిల్ కోర్టుకు సొంత భవనం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి వంగాల నాగరాజు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అరెస్టు తగదు

సూర్యాపేటఅర్బన్ : ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను, రోడ్లను, 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి వెళ్లిన పేదలను, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతోపాటు జిల్లా నాయకులను అరెస్టు చేయడం తగదని పేర్కొన్నారు. రామోజీ ఫిలిం సిటీ దగ్గర నాగపల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007లో ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు.

కళాశాలను సీజ్ చేయాలి

సూర్యాపేటఅర్బన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిబంధనలు పాటించని కళాశాలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి భాను నాయక్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ నారాయణ కళాశాల ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తోందని, ఆ కళాశాలపై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని వినతి పత్రంలో కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లోనూ కాలేజీలో తరగతులు నడపడంతోపాటు, 2025–26 విద్యా సంవత్సరానికి ఎటువంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, మహేష్, నవీన్, వేణు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి



జాజిరెడ్డిగూడెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 29న జరిగే మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని మాలమహానాడు జాతీయ నాయకుడు రెంటాల కరుణకుమార్ కోరారు. ఆత్మగౌరవ సభ కరపత్రాలను జాజిరెడ్డిగూడెంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సభకు మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పగిడిమర్రి ప్రకాశం, బైరిక నరేష్, దుబ్బాక జాన్, నాగయ్య, శ్రీను, ప్రమీల, విమలమ్మ, దీవెనమ్మ, ధనమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

తిరుమలగిరి : రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం పని చేస్తోందని తిరుమలగిరి పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్ అన్నారు. గురువారం సహకార సంఘం కార్యాలయంలో మహా జనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం, రైతులకు రుణాలు, ఎరువుల పంపిణీపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ పానుగంటి నర్సింహారెడ్డి, సీఈఓ విజయ్‌కృష్ణారెడ్డి, డైరెక్టర్లు కిష్టునాయక్, రవీందర్, సత్తయ్య, అవిలయ్య, రాంజానాయక్, స్వర్ణలత, అవిలయ్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

చివ్వెంల : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహేశ్వర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఎవరైనా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దారిలేక నిరుపయోగంగా..



కట్ట వెంట నిర్మించిన మరుగుదొడ్లు



కాలనీవాసులకు అడ్డుగా ఉన్న నాలా



మరుగుదొడ్ల వద్దకు చేరుకునే దారి

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి 9వ వార్డులోని బలహీన వర్గాల కాలనీ సమీపంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో మరుగుదొడ్లను నిర్మించింది. అయితే ఆ కాలనీ ప్రజలు వాటిని వినియోగించుకోవాలంటే సమీపంలోని నల్లచెరువు కట్టపై నుంచి మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. కానీ కట్టకు, కాలనీకి మధ్యలో 8 ఫీట్ల విస్తీర్ణంతో ప్రధాన నాలా(కాలువ) నిర్మించారు. నాలాపై నుంచి వెళ్లేందుకు ఎలాంటి కల్వర్టులు కూడా నిర్మించలేదు. దీంతో కాలనీవాసులు మరుగుదొడ్ల వద్దకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం మరుగుదొడ్లు కాలనీవాసులకు ఉపయోగం లేకుండా మారాయి. నాలాపై కల్వర్టులు నిర్మిస్తే ఈ సమస్య తొలగిపోతుందని కాలనీ ప్రజలు తెలుపుతున్నారు. వెంటనే కల్వర్టు నిర్మించాలని మున్సిపాలిటీ అధికారులను కోరుతున్నారు.

సబ్సిడీ పనిముట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం (ఎస్ఎంఏఎం) కింద రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందించేందుకు అర్హులైన మహిళా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణకాంత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన మహిళా రైతులు ఈ నెల 29వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నాగారం మండలానికి బ్యాటరీ స్ప్రేయర్స్–6, పవర్ స్ప్రేయర్స్ –5, రోటావేటర్స్ –2, (డిస్క్ హారోస్, కల్టివేటర్స్, ఎంబీప్లవ్, కేజ్ వీల్స్)–3, బండ్ ఫార్మర్–1 తదితర పనిముట్లు రాయితీపై ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆసక్తి గల, అర్హులైన మహిళా రైతులు దరఖాస్తుతోపాటు ఫొటో, కొత్త పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, జిరాక్స్ పత్రాలు జత చేసి రైతు వేదిక లేదా మండల వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అర్వపల్లిలో ఎంపీడీఓ టి. గోపికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ మాట్లాడారు. గ్రామంలో కోతుల సమస్యను పరిష్కరించాలని, అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించాలని అన్నారు. గ్రామ పంచాయతీ భవనం శిథిలమైనందున కొత్తది కట్టించాలని కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ నాయకులు పోలెబోయిన లింగయ్య, కార్యదర్శి బయ్యన్న పాల్గొన్నారు.

శునకాల గుంపు.. జనాల్లో వణుకు

- గ్రామాల్లో పెరుగుతున్న కుక్కల బెడద
- వీధుల్లో అడ్డువచ్చిన వారిపై దాడులు



తిరుమలగిరిలో సంచరిస్తున్న కుక్కలు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపై కుక్కలు యథేచ్ఛగా సంచారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీధుల్లో అడ్డు వచ్చిన వారిపై దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే పలుమార్లు కుక్కల దాడిలో పలువురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన సంఘటనలు ఉన్నాయి. రోడ్లపై కుక్కలు ఇష్టారాజ్యంగా తిరుగుతుండటంతో ద్విచక్ర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలంటే జంకుతున్నారు. కుక్కల సమస్యపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

గుంపులుగా సంచరిస్తున్నాయి

వీధుల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. సాయంత్రం, రాత్రి వేళల్లో బైక్‌లపై వెళ్లాలంటే భయమేస్తోంది. కుక్కలు వాహనాలకు అడ్డువచ్చి దాడి చేస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– రాజేష్, తిరుమలగిరి

విద్యార్థులు భయపడుతున్నారు

కుక్కలు అధికంగా ఉన్నాయి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. వీధుల్లో అడ్డువచ్చిన వారిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలి.

– ఉపేందర్, తిరుమలగిరి

పంచాంగం ఆవిష్కరణ

అర్వపల్లి : శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాలను గురువారం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో వైదిక బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మంత్రమూర్తి శంకరమూర్తి ఆవిష్కరించారు. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. బ్రాహ్మణులందరికి పంచాంగాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాశి వెంకటేశ్వర్లుశర్మ, నియోజకవర్గ అధ్యక్షుడు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, మోత్కూరి రాజుశర్మ, నటరాజు, భాస్కరశర్మ, లక్ష్మణశర్మ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



చివ్వెంల : అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు



తుంగతుర్తిలో..

చివ్వెంల : గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించి బిల్లులు విడుదల చేయాలని కోరుతూ గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్ రెడ్డి, రాజుతండా మాజీ సర్పంచ్ ధరావతు భద్రు నాయక్, మొగ్గయ్యగూడెం గ్రామ మాజీ సర్పంచ్ భుక్యా నాగు నాయక్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : గ్రామాల్లో చేపట్టిన పనుల నిధులను విడుదల చేయాలని గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచినా బిల్లులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు లకావత్ యాకునాయక్, గుగులోతు ఈరోజీ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పెన్‌పహాడ్ : భక్తాళాపురం గ్రామ సబ్‌స్టేషన్‌లో 8.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు భక్తాళాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.